సాక్షి నంద్యాల

7

ఆదివారం । 30 । మార్చి । 2025




వైభవంగా పల్లకోత్సవం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రుల బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో కొలువుంచి శ్రీ మఠం ప్రాంగణంలో వైభవంగా ఊరేగించారు. పల్లకోత్సవం కనుల పండువగా సాగింది.



'సేవ'కు పోటు.. జీవితాలపై వేటు!

వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక హామీని మరచి వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేశారు. 8లో▸



వేడుకలకు సిద్ధం

కల్లూరు: ఉగాది వేడుకలకు కల్లూరులోని శ్రీ చౌడేశ్వరి మాత దేవి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడ పండుగ రోజు రైతుల ఎద్దుల బండ్ల ప్రదక్షిణ ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఆనందాలు పండాలి'

నంద్యాల: ఉగాది పండుగ వేళ ప్రజల జీవితాల్లో ఆనందాలు పండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. వేర్వేరుగా శనివారం ఒక ప్రకటన ద్వారా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పచ్చడి వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుందని పేర్కొన్నారు. బంధుమిత్రులతో సంతోషంగా ఉగాది పండుగ జరుపుకోవాలన్నారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఉగాది సందర్భంగా శ్రీశైలానికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకొని కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే భక్తుల కోసం జిల్లాలోని అన్ని డిపోల నందు 50 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



సునీతను అభినందిస్తున్న కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: తక్కువ ఖర్చుతో అధిక లాభాల నిచ్చే ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శనివారం గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామంలోని రైతు బాల మద్దిలేటి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించారు. డ్రోన్ పైలట్‌గా శిక్షణ పొందిన సునీత ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం పిచికారీని ప్రదర్శించారు. జిల్లెల్ల గ్రామ మురుగు కాల్వల్లో పూడికను తొలగించకపోవడంతో పీఎస్‌పై, గ్రామంలో సక్రమంగా ఉపాధి పనులు కల్పించకపోవడంపై ఏపీఓపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభవించిన భక్తి

- నేడు శ్రీశైలంలో తొలి తెలుగు పండుగ
- స్వామిని దర్శించుకుంటే శుభం జరుగుతుందని నమ్మకం
- భారీగా తరలివచ్చిన కన్నడ, మహారాష్ట్ర, ఇరు తెలుగు రాష్ట్రాల భక్తులు
- వైభవంగా సాగనున్న పంచాగశ్రవణం.. రథోత్సవం
- శనివారం నంది వాహనంపై విహరించిన ఆదిదంపతులు
- మహాసరస్వతి అలంకారంలో కటాక్షించిన భ్రామరి
- సంప్రదాయబద్ధంగా వీరాచార విన్యాసాలు



శ్రీశైల పుర వీధిలో అశేష జనవాహిని మధ్య ప్రభోత్సవం



ఉత్సవంలో కళాకారిణి నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: పరమేశ్వరుడు శుభంకరుడు. శివా అనే శబ్దానికి..మంగళం, క్షేమం, ఆనందం అనే అర్థాలు ఉన్నాయి. పరమేశ్వరుడుని ఆరాధిస్తే ఇవన్నీ లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. అందుకే తొలి తెలుగు సంవత్సరం ప్రారంభంలో మహాలింగ చక్రవర్తిగా ప్రసిద్ధుడైన మల్లికార్జున స్వామిని భక్తులు దర్శించుకుంటారు. స్వామిని దర్శించుకుంటే అంతా శుభం జరుగుతుందని నమ్మకం ఉంది. ఇరు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఇప్పటికే శ్రీశైలం చేరుకున్నారు. కన్నడ భక్తులు తమ సొంత గ్రామాల నుంచి పాదయాత్రగా శ్రీగిరి చేరుకున్నారు. ఉగాది మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి పుట్టింటి సారె (పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు) సమర్పిస్తారు. ఇది శతాబ్దాల ఆచారం.

నేడు పంచాగశ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 10.30గంటలకు దేవస్థాన అస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞచే పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం స్వామిఅమ్మవార్లకు రథాంగ హోమం, రథాంగపూజ, రథాంగబలిహారణలు నిర్వహిస్తారు. అనంతరం రథోత్సవం వైభవంగా సాగనుంది.

సేవించి.. తరించి

కన్నడ ప్రాంతానికి చెందిన అల్లమప్రభు, అక్కమహాదేవి, సిద్ధిరామప్ప లాంటి శివశరణులు మల్లికార్జున స్వామివారిని సేవించి తరించారు. 12వ శతాబ్దంలో బసవేశ్వరి ఆధ్వర్యంలో అనుభవ మండపాన్ని అల్లమప్రభు స్థాపించినట్లు స్థల పురాణం చెబుతోంది. అక్కమహాదేవి శ్రీశైలంలో జపమాచరించారు. ఇక్కడి గుహలకే అక్కమహాదేవి పేరు వచ్చింది. శివయోగి సిద్ధరామేశ్వరుడు బాల్యంలోనే మల్లికార్జున స్వామి సాక్షాత్కరించడం ఎంతో విశేషంగా చెప్పబడుతోంది.



అగ్నిగుండం చుట్టూ కన్నడిగుల విన్యాసాలు

సరస్వతీ నమస్తుభ్యం

శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. శ్రీభ్రమరాంబాదేవిని మహాసరస్వతిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. చతుర్భుజాలు కలిగి ఉండి వీణ, అక్షమాల పుస్తకాన్ని ధరించిన ఈ దేవిని దర్శించడంతో విద్యాప్రాప్తితో పాటు అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు. ఉభయ దేవాలయ ప్రాంగాణంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను శనివారం నందివాహనసేవపై అలంకరించారు. ప్రత్యేక అలంకీకృతులైన మహాసరస్వతి అమ్మవారికి, నందివాహనాధీశులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు వాహనసేవ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉత్సవాన్ని నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను దర్శించుకుని భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేస్తున్న అర్చకులు



ఆలయ ప్రదక్షిణలో ప్రత్యేక అలంకీకృతులైన స్వామి అమ్మవార్లు

'వీర' విన్యాసాలు

ఉగాది మహోత్సవాల్లో భాగంగా అమావాస్య ఘడియలను పురస్కరించుకుని అగ్నిగుండప్రవేశం, వీరాచార విన్యాసాలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన వీరశైవ భక్తులు వీరభద్రవచనాలను పఠిస్తూ శూలాలు తదితర అస్త్రాలను తమ చెంపల్లోకి, నాలుకలలోకి, పెదవుల్లోకి, కడుపులోకి, చేతులకు కుచ్చుకున్నారు. ప్రత్యేక వేషధారణలో వివిధ రకాల వాయిద్యాల నడుమ భక్తులు చేసే విన్యాసాలు చూపరులకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించాయి. చివరిగా భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

కనుల పండువగా ప్రభోత్సవం

ఉగాది మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్లకు ప్రభోత్సవం నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించిన ప్రభపై అధిష్టింపజేశారు. అర్చకులు ప్రత్యేక పూజాహారతులు ఇచ్చారు. అనంతరం గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు ప్రభోత్సవం నిర్వహించారు. భక్తుల ఓంకార నినాదాల మధ్య ఉత్సవం కనుల పండువగా సాగింది.

పండుగ రోజూ పని చేయాల్సిందే!

కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పండుగ రోజులైన ఆది, సోమవారాలు కూడా పని చేయనున్నాయి. మార్చి 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో ఉగాది, రంజాన్ పండుగలైన ఆది, సోమవారాల్లో విధులు నిర్వహించాల్సిందేనని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో దాదాపు 300 మంది ఉద్యోగులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు.

1న 'సోషల్' పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 31న జరగాల్సిన పదోతరగతి సాంఘిక శాస్త్రం (సోషల్) పరీక్షను ఏప్రిల్ 1వ తేదీకి మార్పు చేసినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా ఈ మార్పు చేసినట్లు డీఈఓ తెలిపారు.

ప్రశాంతంగా ఒకేషనల్ పరీక్ష

ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు థియరీ పరీక్ష శనివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ మహబూబ్ బేగ్ తెలిపారు. జిల్లాలో 43 పరీక్ష కేంద్రాల్లో 4,754 మందికి గాను 4,655 మంది హాజరయ్యారని, 99మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

కూటమి నేతల మాటలు నమ్మి మోసపోయాం



గాంధీజీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న వలంటీర్లు

- కర్నూలు కలెక్టరేట్ ఎదుట వలంటీర్ల ధర్నా

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల మాటలు నమ్మి మోసపోయామని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఉగాది రోజు వారు ఇచ్చిన హామీని నమ్మి దగా పడ్డామని, రోడ్డున పడి అడుక్కుతుంటున్నామని వాపోయారు. ఈ ఉగాది వలంటీర్లకు ఉగాది కాదని, దగాది అని వ్యాఖ్యానించారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు వలంటీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నూర్ అహ్మద్ మాట్లాడుతూ పోయిన ఉగాదిన సీఎం, డిప్యూటీ సీఎంలు వలంటీర్లకు రూ.10 వేల వేతనంతో కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి రాగానే సాకులు వేతికి ఉద్యోగులను తొలగించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సరైన జీఓలు ఇవ్వలేదని చెప్పడం అన్యాయమన్నారు. అలాంటప్పుడు ఆ ప్రభుత్వం తమను ఐదేళ్లపాటు ఎలా కొనసాగించిందని ప్రశ్నించారు. ఎలాంటి జీఓలు లేనప్పుడు తమ సేవలను విజయవాడ వరదల సమయంలోఎలా వినియోగించుకున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వస్తుందన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు శివ, అనిల్,సునీత, ప్రభావతి, అజ్మతుల్లా, వెంకటేశ్ పాల్గొన్నారు.

తండ్రి, కుమారుడిపై దాడి

కోవెలకుంట్ల: పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయ సమీపంలో శనివారం ఓ యువకుడు ఇనుపకడ్డీతో తండ్రి, కుమారుడిపై దాడి చేశాడు. బాధితులు అందించిన సమాచారం మేరకు.. పట్టణంలోని సంతపేటలో నివాసం ఉంటున్న ముల్లా షరీఫ్ స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈయన కుమారుడు ముల్లా అలీ ఇదే పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరి ప్రేమ వ్యవహారం ఆ యువతి తల్లిదండ్రులకు తెలిసి పంచాయితీ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. యువతి మైనర్ కావడంతో పోలీసులు ఇరు కుటుంబాలకు సర్దిచెప్పి పంపించారు. ఈ క్రమంలో తండ్రి, కుమారుడు శనివారం మినరల్‌వాటర్ ప్లాంట్ వద్ద తాగునీరు పట్టుకుంటుండగా ఇదే కాలనీకి చెందిన మధుంజయుడు అనే యువకుడు ప్రేమ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడికి చేరుకుని వారితో ఘర్షణకు దిగి ఇనుపకడ్డీతో వారిపై దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు దాడి చేసిన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. దాడిలో గాయపడిన తండ్రి, కుమారుడిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. దాడి ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

'సేవ'కు పోటు.. జీవితాలపై వేటు!

రోడ్డున పడిన వలంటీర్లు

- దగా చేసిన కూటమి ప్రభుత్వం
- ఉగాది సాక్షిగా మాట నిలుపుకోని నేతలు
- మొత్తం వ్యవస్థనే లేకుండా చేసిన వైనం
- చిరుద్యోగులతో రాజకీయం



➤ తెల్లవారక ముందే అవ్వా, తాతలను నిద్రలేపి నిస్వార్థంగా పెన్షన్లు అందించిన వలంటీర్ల సేవలను రాజకీయ స్వార్థం కబళించింది.

➤ నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల పిల్లల చదువులకు అవసరమైన సర్టిఫికెట్లను ఇంటి ముంగిళ్లలోనే అందించిన వారిపై వేటు పడింది.

➤ గత ప్రభుత్వం అందించిన అనేక సంక్షేమ పథకాలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా అతి తక్కువ గౌరవ వేతనంతో అనేక రకాల సేవలు అందించిన వలంటీర్లపై కూటమి ప్రభుత్వం కరుణ చూపాల్సింది పోయి కాఠిన్యం ప్రదర్శించింది.

➤ కరోనా కష్టకాలంలో సొంత కుటుంబ సభ్యులు కూడా వారి వద్దకు వెళ్లలేని పరిస్థితుల్లో తమ ప్రాణాలను లెక్క చేయకుండా సేవలందించిన వలంటీర్ల జీవితాలనే ఈ ప్రభుత్వం కూల్చేసింది.

కర్నూలు(అర్బన్): కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఒక్కొక్క హామీకి నీళ్లొదులుతోంది. అధికారంలోకి రాగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు అండ్ కో.. ఉన్న ఉద్యోగ్యులను కూడా వీధిన పడేస్తోంది. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీరు వ్యవస్థకు రూపమే లేదని కూటమి ప్రభుత్వం కూల్చేసింది. గత ప్రభుత్వంలో అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను అర్హులైన పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు పారదర్శకంగా ఇళ్ల వద్దకు చేర్చిన వలంటీర్లపై కూటమి ప్రభుత్వం కక్షకట్టింది. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీరు వ్యవస్థను కొనసాగిస్తామని, పారితోషకాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని నమ్మబలికింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వలంటీరు వ్యవస్థపై ఎటూ తేల్చలేక, చివరకు ఈ వ్యవస్థకు చట్టబద్ధత లేదని తేల్చేసింది. 'వలంటీరు వ్యవస్థే లేనప్పుడు ఎలా కొనసాగిస్తామని, లేని పిల్లాడికి ఏమి పేరు పెట్టాలన్నట్లు ఉందని ' సాక్షాత్తూ మంత్రి డోలా వీరాంజనేయస్వామి చేత శాసనమండలిలో చెప్పించడం గమనార్హం.

నియోజకవర్గాల వారీగా పనిచేసిన వలంటీర్లు ...

నియోజకవర్గం	మొత్తం వలంటీర్లు
బనగానపల్లె	1,564
ఆళ్లగడ్డ	1,495
నంద్యాల	1,542
నందికొట్కూరు	1,376
డోన్	1,435
శ్రీశైలం	1,241
పాణ్యం గడివేముల	1,855
మొత్తం:	10,508

కొనసాగుతున్న పోరాటాలు ...

ఐదేళ్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా సేవలు అందించిన తమను తిరిగి కొనసాగించాలని, ఇచ్చిన మాట ప్రకారం పారితోషకాన్ని రూ.10 వేలకు పెంచాలని వలంటీర్లు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి సంఘాలుగా ఏర్పడి ఉద్యమాన్ని బలోపేతం చేస్తున్నారు. వీరి ఉద్యమాలకు కామ్రేడ్లు కూడా తోడు కావడంతో ఉద్యమ్యం ఉద్ధృతమవుతోంది.

రూ.10 వేల హామీ ఒట్టిదేనా



తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఒక్కో వలంటీర్‌కు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తావని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వలంటీర్లను పట్టించుకోలేదు. మా జీవితాలను ఈ ప్రభుత్వం నిలువునా ముంచింది.

– శ్రీనివాసులు, పెట్నికోట, కొలిమిగుండ్ల మండలం

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహేర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:53
ఆదోని	సా॥ 6:34	ఉ॥ 4:49
నంద్యాల	సా॥ 6:32	ఉ॥ 4:53
ఆత్మకూరు	సా॥ 6:31	ఉ॥ 4:47
బనగానపల్లె	సా॥ 6:34	ఉ॥ 4:51

హదీస్ వెలుగు:

అల్లాహ్ అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. చేసిన పాపాల నుంచి ముక్తి కోసం, కరుణ కోసం నిత్యం దువా చేస్తూ ఉండండి.

– పవిత్ర ఖురాన్

క్లుప్తంగా

డీసీసీబీలో ఫిక్స్‌డ్ డిపాజిట్లకు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీరేట్లు ఇస్తుందని ముఖ్య కార్యనిర్వహణ అధికారి విజయకుమార్ తెలిపారు. డిపాజిట్లకు పూర్తి భద్రతతో పాటు డిపాజిట్ ఇన్సూరెన్స్ గ్యారెంటీ సదుపాయం రూ.5 లక్షల వరకు ఉందని తెలిపారు. 15 నుంచి 29 రోజులకు చేసే డిపాజిట్లకు 4 శాతం, 30 నుంచి 45 రోజులకు 4.25 శాతం, 46 రోజుల నుంచి 90 రోజులకు 4.75 శాతం, 91 రోజుల నుంచి 179 రోజులకు చేసే 5 శాతం, 189 రోజుల నుంచి 270 రోజులకు 5.50 శాతం, 275 రోజుల నుంచి 365 రోజులకు 5.75 శాతం, ఏడాదిపైబడి చేసే డిపాజిట్‌లకు 7.50 శాతం వడ్డీ రేటు ఉంటుందని శనివారం తెలిపారు. 60 ఏళ్ల పైబడిన సీనియర్ సిటీజన్‌లకు అదనంగా 0.75 శాతం వడ్డీరేటు ఉంటుందని తెలిపారు.

5న రగ్బీ సీనియర్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): వచ్చే నెల 5న బీక్యాంపు క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ పురుషులు, మహిళల జట్లకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షులు గుడిపల్లె సురేందర్ శనివారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 14, 15 తేదీల్లో అనంతపురం డీటీసీ పోలీసు మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఉయ్యాలవాడ: ఆర్. జంబులదిన్నెకు చెందిన ఓ వృద్ధురాలు శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఉయ్యాలవాడ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నాగమ్మ(82) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఈమెకు సంతానం లేకపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. ప్రతి నెలా వచ్చే పింఛన్ డబ్బులతో జీవనం సాగిస్తోంది. వృద్ధాప్యం మీద పడటం, ఆరోగ్యం సహకరించకపోవడంతో కనీసం వంట చేసుకునే స్థితిలో కూడా లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో దంతెలకు చీరెతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మధ్యాహ్నమైనా తలుపులు తెరవకపోవడంతో స్థానికులు అనుమానంతో తలుపులు తెరచి చూడగా దంతెలకు వేలాడుతూ శవమై కన్పించింది. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మధ్యంతర భృతి 40 శాతం ప్రకటించాలి

నంద్యాల(న్యూటౌన్): పీఆర్సీ కమిటీని వేసి మధ్యంతర భృతిని పెరిగిన ధరలకు అనుగుణంగా 40 శాతం ప్రకటించాలని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోర్ల సుధాకర్, కాలంగిరి కుమార్ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ అమలుకు 21 నెలలు ఆలస్యమైందని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు 12 లక్షల మంది ఎదురు చూస్తున్నారన్నారు. పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలన్నారు. 11వ పీఆర్సీ, అరియర్స్, డీఏ, సరెండర్ లీవ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలతో కలిపి 23వేల కోట్లు ప్రభుత్వం చెల్లించాలన్నారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు ఒక్క డీఏ అయినా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను అమలు చేయాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి పర్యవేక్షణ అధికారి పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. ఆంగ్ల మధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మత్యనాయక్, గౌరవాధ్యక్షులు కేషాలు నాయక్, రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు రాము, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో పలువురుకి పదవులు దక్కాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 12 నియోజకవర్గాలకు ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం అధ్యక్షులను నియమించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరందరినీ నియమిస్తూ శనివారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

నియోజకవర్గం	పేరు
ఆదోని	పి. పాండురంగ
ఆలూరు	కె. హనుమంతు
కోడుమూరు	రామకృష్ణ యాదవ్
కర్నూలు	ఎం.సత్యరాజ్
మంత్రాలయం	కె. భీమయ్య
పత్తికొండ	టీఎండి. హుస్సేన్
ఎమ్మిగనూరు	ఎస్. అల్లా బకాష్
బనగానపల్లె	షేక్ అలీ హుస్సేన్
డోన్	పింజరి హుస్సేన్ సాహెబ్

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- గోస్పాడులో 43.. కర్నూలులో 42 డిగ్రీలు నమోదు



కర్నూలు(అగ్రికల్చర్): భానుడి భగభగలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శనివారం గోస్పాడులో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ప్రాంతం	ఉష్ణోగ్రత
గోనవరం (పాణ్యం మండలం)	42.83
కోసిగి	42.7
సంజామల	42.7
బనగానపల్లె	42.62
ఆళ్లగడ్డ	42.44
నందికొట్కూరు	42.43
కర్నూలు	42

సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటం గమనార్హం. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండవేడిమి అధికంగా ఉంటోంది. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయట తిరగలేని పరిస్థితి నెలకొంది.

రూ.42.13 కోట్లతో రోడ్ల పునర్నిర్మాణం

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పూర్తి శిథిలావస్థకు చేరిన రోడ్లను పునర్నిర్మించేందుకు నాబార్డు నిధులు రూ.42.13 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు వి.రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.19.74 కోట్లతో 48.80 కిలోమీటర్లు, నంద్యాల జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.22.39 కోట్లతో 54.11 కిలోమీటర్ల మేర రోడ్లను పునర్నిర్మిస్తామన్నారు. ఆయా రోడ్లకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు.

టీడీపీ నాయకుడిపై కేసు నమోదు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌కు చెందిన వీఆర్వో వెంకటేశ్వర్లుపై దాడి చేసి గాయపరచిన టీడీపీ నాయకుడు సీబీ ఆదిత్యరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తిమ్మప్ప శనివారం తెలిపారు. మిగులు భూమి ఆన్‌లైన్ విషయమై సి.బెళగల్‌కు చెందిన టీడీపీ నాయకుడు సీబీ ఆదిత్య రెడ్డి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో వెంకటేశ్వర్లుపై దాడి చేసి గాయపరిచిన సంఘటన పాఠకులకు విదితమే. బాధిత వీఆర్వో ఫిర్యాదు మేరకు దాడి, విధులకు ఆటంకం కలిగించాడని ఆదిత్య రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మృతదేహంతో ధర్నా



మృతదేహంతో ధర్నా చేస్తున్న తెర్నెకల్ వాసులు

దేవనకొండ: అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యుదాఘాతంతో యువకుడు గిరిపోగు ప్రతాప్ మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తెర్నెకల్‌లోని బస్టాండు ప్రాంతంలో మృతదేహంతో కుటుంబ సభ్యులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో రెండు సచివాలయాలు ఉండగా గ్రామసభలను వాటి సమీపంలో నిర్వహించకుండా కూటమి నాయకుల మెప్పుకోసం బస్టాండు సమీపంలో రోడ్డుపై ఏర్పాటు చేశారన్నారు. విద్యుత్ అధికారులు ఆ ప్రదేశం ప్రమాదకరమని చెప్పినా వినకుండా టెంటు వేశారని, దానిని తీయబోయే క్రమంలో విద్యుదాఘాతానికి గురై గిరిపోగు ప్రతాప్ మృతి చెందాడన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవనకొండ సీఐ వంశీనాథ్.. తెర్నెకల్ గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబాన్ని నచ్చజెప్పి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఉన్న గిరిపోగు ప్రతాప్ మృతదేహాన్ని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పరిశీలించారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు పోరాడతామన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నాగరాజు (ఫైల్)

జూపాడుబంగ్లా: కర్నూలు – గుంటూరు రహదారిపై జూపాడుబంగ్లా సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కొత్తపల్లి మండలం బండినాయనిపల్లె గ్రామానికి చెందిన నాగరాజు (45) శుక్రవారం 80 బన్నూరు గ్రామానికి బైక్‌పై వచ్చాడు. అక్కడి నుంచి జూపాడుబంగ్లాకు వచ్చిన అతను తిరిగి బైక్‌పై 80 బన్నూరు గ్రామానికి వెళ్తుండగా జూపాడుబంగ్లా సమీపంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తూ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన నాగరాజును చికిత్స నిమిత్తం 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక సాయంత్రం మృతిచెందాడు. మృతునికి భార్య రాములమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ విజయభాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.